ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 13 జూలై 2024

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

» సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి

» నక్కపల్లిలో బయోటెక్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలు

» తాడి గ్రామం తరలింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి సూచన

- 5లో

అధిక ధరలకు కళ్లెం!



అనకాపల్లి మార్కెట్‌లో ఒక స్టాల్ వద్ద కొనుగోలుదారుడికి కందిపప్పు ప్యాకెట్ అందిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరల స్థిరీకరణ

- కందిపప్పు, బియ్యం తగ్గింపు ధరలకు విక్రయాలు
- స్టాల్స్ ఏర్పాటు చేస్తున్న పౌర సరఫరాల శాఖ
- బియ్యం కిలో రూ.49, కందిపప్పు కిలో రూ.160 విక్రయాలు
- త్వరలో మండలాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిత్యావసర సరకుల ధరలు చుక్కలనంటాయి. బియ్యం, పప్పు దినుసుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

జిల్లాలో రైతుబజార్లు, బహిరంగ మార్కెట్‌లలో సన్నబియ్యం, కందిపప్పు ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా పౌరసరఫరా శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో 5 స్టాల్స్, నర్సీపట్నంలో 5, ఎలమంచిలి మున్సిపాలిటీలో 5 చొప్పున బహిరంగ మార్కెట్ దుకాణాల్లో 15 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ద్వారా సన్నబియ్యం, కందిపప్పు ధరలను నియంత్రించారు. సోనామసూరి సన్నబియ్యం కిలో రూ.49, కందిపప్పు సాధారణ రకం కిలో రూ.160 ధర ఉండేలా నిర్ణయించారు. జిల్లా కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి పరిధిలోని హోల్‌సేల్ వ్యాపారులతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే చర్చలు జరిపారు. ధరల స్థిరీకరణలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సహకరించాలని వ్యాపారులకు సూచించారు. జిల్లాలో తొలి విడతగా 15 ఎంపిక చేసిన స్టాల్స్ వద్ద ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేసి బియ్యం, కందిపప్పు విక్రయాలు శుక్రవారం నుంచి ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు సాధారణ రకం కిలో ధర రూ.181 నుంచి రకాన్ని బట్టి కిలో ధర రూ.190 వరకు పలుకుతోంది. జిల్లాలో ఇకముందు పౌరసరఫరాల శాఖ ఎంపిక చేసిన స్టాల్స్‌లో కిలో ధర రూ.160 విక్రయించనున్నారు. స్టీమ్డ్ సోనామసూరి సన్నబియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.56 నుంచి రూ.60 వరకు ధర ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఎంపిక చేసిన స్టాల్స్‌లో ఇకముందు స్టీమ్డ్ సోనామసూరి సన్నబియ్యం కిలో కేవలం రూ.49కి లభించనుంది. సోనామసూరి సాధారణ రకం బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.55 ధర ఉంటే ఇక ముందు కిలో రూ.48కి మాత్రమే విక్రయించనున్నారు. ధరల స్థిరీకరణ చర్యల వల్ల కిలో బియ్యం వద్ద వినియోగదారులకు రూ.5, అదేవిధంగా కందిపప్పు కిలో వద్ద రూ.20 వరకు తగ్గుతుంది. ఎంపిక చేసిన స్టాల్స్‌లో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఎటువంటి రేషన్ కార్డు, ఇతరత్రా గుర్తింపు లేకుండానే తగ్గించిన ధరలకు వీటిని పొందవచ్చు. భవిష్యత్తులో ప్రభుత్వ ధరల స్థిరీకరణ స్టాల్స్‌ను జిల్లాలో అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ప్రయోగాత్మకంగా ముందుగా జిల్లాలో జీవీఎంసీ, రెండు మున్సిపాలిటీల్లో స్టాల్స్‌ను ప్రారంభించామన్నారు. తర్వాత మరికొన్ని నిత్యావసర సరకులను జోడించి, ఇతర ప్రాంతాలకు స్టాల్స్‌ను విస్తరిస్తామని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వామనావతారంలో జగన్నాథుడు



జగన్నాథ దశ రూప మహోత్సవాలలో భాగంగా శుక్రవారం జగన్నాథస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

- చోడవరం

ఆ పది లక్షలు ఏమయ్యాయి?

ఎండోమెంట్ అధికారులను ప్రశ్నించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఎండోమెంట్ అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

- నర్సీపట్నం నూకాంబికా ఆలయ నిర్మాణానికి సీఎంఆర్ అధినేత రూ. పది లక్షల విరాళం
- ఏ పనులకు ఖర్చు చేశారని ప్రశ్నించిన అయ్యన్న
- దేవదాయ శాఖకు జమ కాలేదన్న అధికారులు
- విచారణ చేసి చర్యలు తీసుకోవలసిందిగా అసిస్టెంట్ కమిషనర్‌కి స్పీకర్ ఆదేశం

నర్సీపట్నం, జూలై 12:

నూకాంబికా అమ్మవారి ఆలయం నిర్మాణానికి సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ విరాళంగా ఇచ్చిన రూ.10 లక్షలు ఎక్కడికి వెళ్లాయో తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఎండోమెంట్, ఆర్అండ్‌బీ అధికారులతో ఆయన స్వగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ యజమాని ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన రూ.10లక్షలు దేనికి ఖర్చు చేశారని దేవదాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. డీఈ ఈకేవీ కృష్ణ మాట్లాడుతూ ఆ డబ్బులు దేవదాయ శాఖకు చేరలేదని వివరించారు. ఎండోమెంట్‌కి తెలియకుండా డబ్బులు ఏమయ్యాయని స్పీకర్ ప్రశ్నించారు. తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్‌ని ఆదేశించారు. సుబ్బారాయుడుపాలెం,జోగినాథునిపాలెం, చమ్మచింత రామాలయాలు, నర్సీపట్నం నూకాంబికా అమ్మవారి ఆలయం పనులు ఆగస్టులోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమీక్ష

గొలుగొండ మండలం ఆరిలోవ రోడ్డు, నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై ఆర్అండ్‌బీ, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమీక్ష నిర్వహించారు. ఆరిలోవ రోడ్డుకు ఫారెస్ట్ అనుమతులు ఉన్నప్పటికీ కల్వర్టులు కట్టకుండా రోడ్డు వెడల్పు తగ్గించి ఎందుకు నిర్మాణం చేశారని ప్రశ్నించారు. రోడ్డు ఇన్‌స్పెక్షన్ చేసి 40 రోజులు అవుతున్నా నాసిరకం పనులపై కాంట్రాక్టర్, అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ నెల 22 తేదీలోగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్అండ్‌బీ రోడ్డుపై మునిసిపాలిటీ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. పెద్ద చెరువు ట్యాంక్ బండ్ పనులు తిరిగి ప్రారంభించడానికి ఫైల్ ఏ దశలో ఉందని అడిగారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పనులు త్వరగతిన పూర్తి చేయాలన్నారు.



జనరల్ వార్డులో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులు

నక్కపల్లి ఆస్పత్రిలో భోజనం బంద్

4 నెలలుగా రోగుల ఇబ్బందులు

- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడమే కారణం
- ఇన్‌పేషెంట్లకు ఇళ్ల నుంచి క్యారియర్లు



ఇంటి నుంచి వచ్చిన క్యారియర్‌లో భోజనం చేస్తున్న పేషెంట్

నక్కపల్లి, జూలై 12: నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులకు నాలుగు నెలలుగా భోజనం నిలిచిపోయింది. ఉదయం అల్పాహారం (టిఫిన్), మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాల్సి వుంది. ఈ ఏడాది మార్చి వరకూ సంబంధిత కాంట్రాక్టరు రోగులకు భోజనం సరఫరా చేశారు. ఏప్రిల్ నుంచి రోగులకు ఈ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. వ్యాధి తీవ్రతతో వున్న రోగులను కనీసం 3, లేదా 4 రోజులు జనరల్ వార్డులో ఇన్‌పేషెంట్లుగా చేర్చి, వైద్యసేవలందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులకు ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం పెట్టాల్సి వుంది. కానీ గత ఏడాది ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌కు వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయన చేతులెత్తేసినట్టు తెలిసింది. ఫలితంగా ఏప్రిల్ నుంచి రోగులకు భోజనం సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులకు వారి కుటుంబసభ్యులే రెండు పూటలా క్యారియర్లు తీసుకురావల్సి వస్తోంది. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లోని అనేక ప్రాంతాల నుంచి రోగులు నక్కపల్లి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం నిలిపివేయడంతో రోగులకు, వారి కుటుంసభ్యులు ఇబ్బంది పడుతున్నారు. రెండు పూటల దూర ప్రాంతాల నుంచి హైవే మీదుగా క్యారియర్లు తీసుకురావడం ఇబ్బందిగా వుంటుందని రోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోగులకు భోజన సదుపాయాన్ని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషాను సంప్రదించగా.. ఏప్రిల్ నుంచి రోగులకు భోజన సదుపాయం నిలిచిపోయిన మాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. వారం రోజుల్లోగా మరలా భోజనాన్ని పునరుద్ధరిస్తామన్నారు.

సకాలంలో ఇంజనీరింగ్ ప్రవేశాలు

వెబ్ ఆప్షన్స్‌కు ముగిసిన గడువు



- 16న తొలివిడత సీట్ల అలాట్‌మెంట్
- గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు ప్రారంభమైన అడ్మిషన్స్ ప్రక్రియ
- ప్రవేశాలు పెరుగుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యా శాఖ ఈ ఏడాది వేగంగా ప్రారంభించింది. గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ మొదలైంది. తొలివిడత సీట్ల కేటాయింపు గడిచిన ఏడాదితో పోలిస్తే 24 రోజుల ముందే పూర్తికానున్నది. ఇది ప్రవేశాల పెరుగుదలకు దోహదం చేస్తుందని నగర పరిధిలోని ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. గతంలో తొలి విడత నుంచి మూడో విడత వరకూ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసేందుకు కనీసం రెండు నెలలు సమయం తీసుకునేవారని, ఇప్పుడు వేగంగా పూర్తి చేయడంపై ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ దృష్టి సారించడం కళాశాలలకు సానుకూల అంశమన్నారు. గతంలో అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభించడం, రెండు, మూడు విడతలు సుదీర్ఘంగా నిర్వహించడం వల్ల వందలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుండే వారని, అదేవిధంగా మరికొంతమంది డీమ్డ్ వర్సిటీల్లో చేరిపోయేవారని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఉన్నత విద్యా శాఖ వేగంగా ప్రక్రియను ప్రారంభించడం వల్ల అటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గత ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి (2023-24 విద్యా సంవత్సరం) జూలై 24 నుంచి రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 12న తొలి విడత సీట్లను కేటాయించారు. ఈ విద్యాసంవత్సరానికి (2024-25) ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఎనిమిదో తేదీ నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించిన అధికారులు.. ఈ నెల 16న తొలి విడత సీట్లను కేటాయించనున్నారు. గత ఏడాదితో పోలిస్తే సుమారు 24 రోజులు ముందుగానే తొలి విడత అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తికాబోతోంది.

ఫీజుల్లో అస్పష్టతతో ఇబ్బంది..

రాష్ట్రంలో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ మూడేళ్ల కాలానికి ఫీజులను సిఫారసు చేసింది. ఈ మేరకు తొలుత కనిష్ఠ ఫీజుగా రూ.45 వేలను, గరిష్ఠ ఫీజుగా రూ.1.05 లక్షలుగా నిర్ణయించింది. జిల్లాలో గరిష్ఠ ఫీజు జాబితాలో గాయత్రీ విద్యాపరిషత్ మాత్రమే చోటు దక్కించుకుంది. మిగిలిన కాలేజీలకు కేటగిరీలను బట్టి ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. అయితే, ఈ ఫీజులకు సంబంధించిన సిఫారసులను గత ప్రభుత్వం ఆమోదించకుండా మార్చేందుకు యత్నించింది. దీనిపై కాలేజీ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించగా కమిషన్ తొలి సిఫారసులను అమలు చేయాలని స్పష్టంచేసింది. అంటే, కనిష్ఠ ఫీజుగా రూ.45 వేలను కొనసాగించాలి. కానీ, ఉన్నత విద్యాశాఖ అందుకు విరుద్ధంగా కనిష్ఠ ఫీజును రూ.40 వేలకు కుదిస్తూ జీవో జారీచేసింది. దీనిపై కనిష్ఠ ఫీజు జాబితాలో ఉన్న కాలేజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ, ప్రైవేటు కాలేజీలు మధ్య వివాదం నడుస్తోంది. అయితే ఇది రిజిస్ట్రేషన్స్‌పై ప్రభావం చూపించదని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి.

ప్రమాద స్థాయికి కల్యాణపులోవ నీటిమట్టం

ఏ క్షణానైనా గేట్లు ఎత్తివేసే అవకాశం

- రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా.. ప్రస్తుతం 458 అడుగులు
- రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులు




కల్యాణపులోవ నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఏఈఈ సత్యనారాయణదొర

రావికమతం, జూలై 12:

మండలంలోని కల్యాణపులోవ జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. ఏ క్షణంలోనైనా రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని విడిచి పెట్టే అవకాశం ఉంది. రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా.. ప్రస్తుతం 458 అడుగులకు నీటిమట్టం చేరింది. శుక్రవారం జలాశయం నీటిమట్టాన్ని ఏఈఈ సత్యనారాయణ దొర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ ప్రాంతంలో వర్షాలు లేనప్పటికీ ఎగువ కొండల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోందన్నారు.

ప్రస్తుతం 60 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. 459 అడుగులకు నీటిమట్టం చేరుకుంటే రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర నీటిని సర్పానదిలోకి విడిచి పెడతామన్నారు. నీటిని విడిచి పెడితే సర్పానదిని ఆనుకొని ఉన్న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన చీమలపాడు, జడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఈ సత్యనారాయణ దొర కోరారు.

శాకాంబరీగా కన్యకాపరమేశ్వరి




శాకాంబరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఆషాడమాసం సందర్భంగా అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం శాకాంబరిదేవిగా అలంకరణ చేశారు. వివిధ రకాల కూరగాయల అమ్మవారిని అలంకరించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - అనకాపల్లి టౌన్

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- అచ్యుతాపురం-పరవాడ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని రకాల పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల నిర్వహణకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమల గురించి ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

» మృతుడిది విశాఖ జిల్లా సబ్బవరం


నూకరాజు (ఫైల్)

భోగాపురం, జూలై 12: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా సబ్బవరం మండలం ఎరుకునాయుడుపాలానికి చెందిన గంగ్రేటి నూకరాజు(36) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విధుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన బంధువు ఏనుగుల రాముతో కలిసి హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి లారీపై బిస్కెట్ లోడును తీసుకు వస్తున్నారు. అయితే వీరిది సబ్బవరం కావడంతో హైదరాబాద్ నుంచి సబ్బవరం చేరుకుని అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకున్నారు. మళ్లీ సబ్బవరం నుంచి శ్రీకాకుళానికి లారీతో శుక్రవారం బయలుదేరారు. శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో సుందరపేట సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి అప్పటికే మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందగా, ఏనుగుల రాముకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు అన్నయ్య ఎంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

» ఇద్దరికి తీవ్ర గాయాలు » ఒకరి పరిస్థితి విషమం

ఎస్.రాయవరం, జూలై 12: మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ భూలోక, హైవే పెట్రోలియం పోలీసులు తెలిపిన వివరాలివి. తుని పట్టణ పరిధి ఇసకల పేట ప్రాంతానికి చెందిన కె.అంజి, నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామానికి చెందిన సీహెచ్.అంజి అనే ఇద్దరూ కలిసి బైక్‌పై తుని నుంచి అనకాపల్లిలో ఉన్న తమ బంధువుల ఇంటికి శుక్రవారం బయల్దేరారు. ఇక్కడి అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి వీరి బైక్ అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొంది. దీంతో వీరిద్దరూ రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు పంపారు. వీరిలో కె.అంజికి తలకు గాయం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు

పాయకరావుపేట, జూలై 12: పట్టణంలోని మంగవరం రోడ్డులో ఇటీవల ఓ వ్యక్తిపై దాడిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నక్కపల్లి మండలంలోని ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి పాయకరావుపేటలోని పత్రివారి వీధిలో నివాసముంటున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తున్నారు. స్థానిక మంగవరం రోడ్డులోని మిల్లు వద్దకు అతను చేరడంతో పట్టణంలోని పాత హరిజనవాడకు చెందిన జక్కుల శ్రీనివాస్, కిల్లాడి ఇస్సాకు, సయ్యద్‌బాబాలు మద్యం మత్తులో అడ్డగించి దాడి చేశారు. దీనిపై బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఎస్ఐ జోగారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాకర్లు సీజ్

» రూ.30 వేలు అపరాధం

నర్సీపట్నం, జూలై 12: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితుల నుంచి అపరాధ రుసుం వేసినట్టు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలి పారు. నిబంధనలకు విరుద్ధంగా రాజమండ్రి నుంచి ఇసుక ట్రాక్టర్లపై తీసుకొచ్చి బలిఘట్టం తలుపులమ్మ తల్లి గుడి సమీపంలోని కాటా దగ్గర నిల్వ ఉంచి, టాక్టర్లలో తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుం వసూలు వేసినట్టు చెప్పారు.

కలుషిత ఆహారం కారణం కాదు

» జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రేజ


ఎంఈవో, హెచ్‌ఎంతో మాట్లాడుతున్న శ్రేజ

బుచ్చెయ్యపేట, జూలై 12: వడ్డాది జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యారినులు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురి కాలేదని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రేజ తెలిపారు. ఆమె శుక్రవారం హైస్కూల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజన వంటకాల శాంపిల్స్‌ను పరిశీలించారు. ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం శేషుబాబు, వడ్డాది, చోడవరం పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె హైస్కూల్ విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

దూరప్రాంత రైళ్లకు అదనపు సాధారణ కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 12: ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర రైల్వే శాఖ ఆదేశాల మేరకు పలు దూర ప్రాంత రైళ్లకు అదనపు సాధారణ కోచ్‌లు జత చేశామని, మరికొన్ని రైళ్లకు నవంబరు నుంచి అందుబాటులోకి తీసుకురాన్నుట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. వీటిలో విశాఖ మీదుగా నడిచే హౌరా-సికింద్రాబాద్-హైరా ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703/ 12704), విశాఖ-హైదరాబాద్ - విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727/12728), సికింద్రాబాద్- భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016/17015), న్యూ టిన్సుకియా - బెంగళూరు- న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (22502/22501), న్యూటిన్సుకియ - తంబరం - న్యూ టిన్సుకియా (15930/15929), డి బ్రుగర్- కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504/22503), గువహటి- బెంగళూరు- గుహవటి (12510/12509), బెంగళూరు- భగల్‌పూర్-బెంగళూరు (12253/12254) ఉన్నా యి. కా గా, నవంబరు నుంచి విశాఖ- న్యూఢిల్లీ- విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (2080 5/ 20806), విశాఖ-కోర్బా- విశాఖ (18517/18518), విశాఖ-కడప/ తిరుపతి- విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488 /17487), విశాఖ- నిజాముద్దీన్ - విశాఖ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803/12804), విశాఖ- నిజాముద్దీన్- విశాఖ స మతా ఎక్స్‌ప్రెస్ (12807/ 12808), విశాఖ- ఎల్‌టీటీ-విశాఖ వయా రాయగడ (22847/ 22848), విశాఖ- డీఘా-విశాఖ (22874/22873), విశాఖ- ఎల్‌టీటీ - విశాఖ వయా విజయవాడ (18519/18520), భువనేశ్వర్-బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463/18464), భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ (22871/ 22872), భువనేశ్వర్- తిరుపతి- భువనేశ్వర్ (22879/22880), భువనేశ్వర్- చెన్నై-భువనేశ్వర్ (12830/12829), భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ (12845/ 12846), భువనేశ్వర్- పాండిచ్చేరి- భువనేశ్వర్ (12898/12897), భువనేశ్వర్-రామేశ్వరం-భువనేశ్వర్ (20896/20895), పూరి-చెన్నై - పూరి (22859/ 22860) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నవంబరు నుంచి అదనపు సాధారణ కోచ్‌లు జత చేయనున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలి

» రాజకీయాల్లో ఉన్నవారికి అధ్యయనం, కష్టపడే తత్వం అవసరం
» రాజకీయాల్లో సిద్ధాంతం తగ్గి, రాద్ధాంతం పెరుగుతోంది
» బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని ప్రజలు నమ్మారు
» విశాఖ కన్నతల్లిలా ఆదరించింది
» మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
» 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సంగమం చేసిన మిత్రులు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), జూలై 12: జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మిత్ర బృందం రుషికొండలోని ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆత్మీయ సంగమం ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నవారికి ముఖ్యంగా అధ్యయనం, కష్టపడే మనస్తత్వం ఉండాలన్నారు. నిత్యం ప్రజల్లో తిరగాలన్నారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు చేపట్టానని, అవన్నీ రావడానికి మిత్రులు, పెద్దల ఆశీర్వాదమే కారణమన్నారు. కార్యదీక్ష ఉంటే కార్యదక్షత అదే వస్తుందన్నారు. రాజకీయాలలో సిద్ధాంతం తగ్గిపోతుందని, రాద్ధాంతం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని ప్రజలు నమ్మారన్నారు. రాజకీయాల పట్ల ప్రజలలో రోజురోజుకీ గౌరవం తగ్గిపోతుందన్నారు.



వెంకయ్యనాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ నగరం కన్నతల్లిలా ఆదరించిందన్నారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ నష్టపోకూడదని అప్పట్లో ఎంతో జాగ్రత్తపడ్డామన్నారు. ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి సాధించుకున్నామన్నారు. ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా మన ప్రాంతానికి మేలు చేయాలనే తపన ఉండేదన్నారు. కార్యక్రమంలో మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ దేశంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన మూడు నగరాల్లో విశాఖకు స్థానం దక్కిందంటే..అది వెంకయ్యనాయుడు పుణ్యమేనన్నారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈసారి అసెంబ్లీలో మొదటిసారి ఎమ్మెల్యేలు అయినవారు 88 మంది ఉన్నారన్నారు. వారు వెంకయ్యనాయుడు ప్రసంగాలు వింటే చాలు రాజకీయాలలో ఎదుగుతారన్నారు. తొలిసారి ఎమ్మెల్యేలైన వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. ఆ కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా వెంకయ్యనాయుడును కోరగా ఆయన సమ్మతించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సమున్నత వ్యక్తిత్వం కలిగిన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చారన్నారు. ఆయన ప్రసంగాలు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు రాసిన పుస్తకాలను మిత్రులకు, అతిథులకు అందజేశారు. కార్యక్రమానికి శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలి

» నక్కపల్లి నుంచి వాహనాల ద్వారా తెచ్చుకోవడం భారంగా మారుతుందని పలువురు ఆవేదన
» స్థానికంగా ఏర్పాటు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని సూచన

అచ్యుతాపురం, జూలై 10 : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ఇసుక డిపోను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు రావడంతో సామాన్య మధ్య తరగతికి ఇసుక అం దని ద్రాక్షలా మారింది. ఆ ప్రభుత్వంలో వెదురువాడ వద్ద ఇసుక డిపోను ఏర్పాటుచేసి విక్రయాలు జరిపింది. ఇక్కడ కాటా కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇసుక మాఫియా అధికంకావడంతో ఇసుక విక్రయాలను ఇక్కడ ఆపేశారు. దీంతో స్థానిక నాయకుల అండదండలతో అక్రమ ఇసుక విక్ర యాలు ప్రారంభించారు. కొంత మంది రాజమండ్రి నుంచి ఇసుకను అనధికారికంగా రప్పించి వెదురువాడలో స్టాక్‌చేసి విక్రయాలు ప్రారంభించారు. దీనికితోడు కొండగెడ్డలు, వాగుల నుంచి సొంత వాహనాలతో ఇసుకను తెచ్చి విక్రయాలు జరిపేవారు. తాగాజా ఎన్నికైన కూటమి ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకు వచ్చింది. సామాన్య, మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టడంతో నిర్మాణ రంగ కార్మికులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లి డిపోల్లో మాత్రమే ఇసుక ఉంది. అచ్యుతాపురం నుంచి నక్కపల్లికి యాభై కిలోమీటర్ల దూరం. నక్కపల్లి నుంచి అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పూడిమడకకు ఇసుక తీసుకువెళ్లాలంటే వినియోగదారుడికి అదనపు భారం పడుతోంది. సాధారణ ప్రజలతో పాటు సెజ్‌లో నిర్మించే కర్మాగారాలకు కూడా అధికంగా ఇసుక అవసరం ఉంటుంది. ఈ తరుణంలో అచ్యుతాపురంలో డిపో ఏర్పాటుచేస్తే ఇసుక అందరికీ అందుబాటులో ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. గత ప్రభుత్వం వెదురువాడ వద్ద ఇసుక డిపో నిర్వహించింది. అక్కడే మళ్లీ ఇసుక డిపోను ఏర్పాటుచేస్తే అంద రికీ ఇసుక అందుబాటులో ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ఉన్నతాధికా రులు కృషి చేయాల్సిందిగా కోరుతున్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

» సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి
» పీపీపీ విధానంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి
» తాడి గ్రామం తరలింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి సూచన
» నక్కపల్లిలో బయోటెక్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలు
» తిమ్మాపురంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలో భూ ఆక్రమణదారులపై కఠినంగా ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు పరిరక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన పలు అంశాలను కలెక్టర్ శుక్రవారం విలేకరులకు వివరించారు. భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు ఉపేక్షించవద్దని, కేసులు నమోదుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా 22 (ఎ) జాబితా నుంచి భూములు మినహాయింపు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారన్నారు. పరవాడ ఫార్మాసిటీకి ఆనుకుని తాడి గ్రామం తరలింపు గురించి సీఎం ప్రత్యేకించి చెబుతూ పునరావాసం, మరోచోట గ్రామస్థులకు ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకు నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అనకాపల్లి జిల్లా యంత్రాంగాన్ని సూచించారన్నారు. నక్కపల్లి ప్రాంతంలో బయోటెక్ పార్కు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ పరిధిలో రహదారుల అభివృద్ధికి పీపీపీ విధానం అమలుచేయాలని సూచించారని తెలిపారు. భీమిలి మండలం తిమ్మాపురంలో ఐదెకరాలలో యూనిటీ మాల్ ఏర్పాటుకు కేంద్రం రూ.172 కోట్లతో ప్రాజెక్టును మంజూరుచేసిందని పేర్కొంటూ దాని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. పీఎం ఏక్తా మాల్ పేరుతో కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసే ఈ మాల్‌లో చేనేత వస్త్రాలతోపాటు మిగిలిన సాధారణ మాల్స్‌లో మాదిరిగా అన్నిరకాల వస్తువులు లభ్యమవుతాయని, దీనికి సంబంధించి వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించనున్నట్టు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారని తెలిపారు.

పరశురామావతారంలో జగన్నాథస్వామి


పరశురామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 12: పట్టణంలోని గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి శుక్రవారం పరశురామావతారంలో దర్శనమిచ్చారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామికి విశేష అలంకరణ చేపట్టిన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఒకటి నుంచి అన్ని పాఠశాలల్లో స్కౌట్ శిక్షణ

» జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కొత్తూరు, జూలై 12 : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆగస్టు ఒకటో తేదీ నుంచి స్కౌట్‌లో శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం చిన్న హైస్కూల్‌లో జరిగిన సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నెల ఆఖరి వారంలో జిల్లాలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రైవేటు యాజమాన్యాలలోని 50శాతం పాఠశాలల నుంచి 108 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు స్కౌట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆ తరువాత ఆగస్టు నుంచి ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో మంచి సేవాతత్పరత ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కూడా ఉంటుందని ఆమె వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి, రాష్ట్ర శిక్షణ అధికారి మోహన్‌రావు, పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు, స్కౌట్ సభ్యులు సావిత్రి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది జడ్పీ హైస్కూల్ సందర్శించిన డీపీవో శిరీషారాణి

» అస్వస్థతకు గురైన ఆరుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
» ఓ విద్యార్థినికి పీహెచ్‌సీకి తరలింపు


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న శిరిషారాణి

బుచ్చెయ్యపేట, జూలై 12: వడ్డాది జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం డీపీవో శిరీషారాణి సందర్శించారు. గురువారం హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీపీవో హైస్కూల్‌ని సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై హెచ్‌ఎం శేషుబాబు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకును పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.

అనంతరం ఆమె వడ్డాది గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మండలంలో గల రక్షిత మంచినీటి ట్యాంకులు, చేతిబోర్లలో నీటి నమూనాలు సేకరించి, నీటి నాణ్యతను ల్యాబ్ ద్వారా పరీక్షించాలని ఆదేశించారు. డ్రైనేజ్‌ల పూడికతీత పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరీష్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకట ఆచార్యులు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదవిద్యకి మళ్లీ అస్వస్థత

ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో, జిల్లా వైద్యశాఖాధికారి ఆదేశాలు మేరకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హైస్కూల్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, బలహీనంగా ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కాగా, గురువారం అస్వస్థతకు గురైయిన విద్యార్థిని వేదవిద్య శుక్రవారం కూడా స్పృహ తప్పడంతో హుటాహుటీన వడ్డాది పీహెచ్‌సీకి తరలించారు. పంచాయతీ సమావేశంలో ఉన్న డీపీవో శిరిషారాణికి ఈ విషయం తెలియడంతో ఆమె వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి విద్యార్థిని వేదవిద్య ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టరు మౌనికను ఆదేశించారు.

హార్టికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలకు ఏవో సిఫారసు

» రాయితీ పథకాల పేరుతో రైతుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
» విధి నిర్వహణలో నిర్లక్ష్యం


నరేంద్ర
హార్టికల్చర్ అసిస్టెంట్

రోలుగుంట, జూలై 12: వ్యవసాయ, ఉద్యానవన శాఖల నుంచి మంజూరు చేసే పథకాలు, రైతులకు ఉపయోగపడే ఇతర యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందిస్తానని నమ్మబలికి రైతుల నుంచి లక్షల్లో వసూళ్లు చేసిన మండలంలోని కె.నాయుడుపాలెం ఆర్‌బీకే కేంద్రం హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) నరేంద్రపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇతడు ఎప్పుడూ ఆర్‌బీకేలో రైతులకు అందుబాటులో లేకపోవడంతో పాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా వచ్చే రాయితీలను అందిస్తానని రైతుల నుంచి అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలను అందించడానికి ఆర్‌బీకేలో రైతుల నుంచి విత్తనాల కోసం చెల్లించిన దాదాపు 80 మంది రైతులకు చెందిన రూ.1.72 లక్షలు నేటికీ ఆర్‌బీకే ఖాతాకు జమ చేయకుండా పక్కదారి పట్టించాడన్నారు. ఆర్‌బీకేలో సంబంధింత రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. గత ఏడాది గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి రాయితీపై యాంత్రీకరణ యంత్రాలను తక్కువ ధరకే ఇప్పిస్తానని వసూళ్లు చేసిన ఘటనపై రైతులు కూడా గతంలోనే ఫిర్యాదు చేశారని తెలిపారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అధికారులపైనే బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఏవో తెలిపారు.

వెద పద్ధతిలో వరి విత్తడం మేలు

నారుమడి పెంచే సమయం కలిసి రావడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుదల

» 25 రోజుల ముందే పంట కోత దశకు చేరిక
» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


జి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

అనకాపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, కూలీల కొరత నేపథ్యంలో రైతులు వెద పద్ధతిలో వరి విత్తుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యద పద్ధతిలో వరి విత్తుకోవడం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని, నారుమడి పెంచే సమయం కలిసి రావడమే కాకుండా పంట 20 నుంచి 25 రోజుల ముందే కోతకు వస్తుందని వివరించారు. ఈ విధానం ఆచరించి వరి సాగు చేసే రైతులకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈసాగు చేసే రైతులు ప్రధానంగా ఎదుర్కొనే కలుపు సమస్య నివారణకు తగిన సమయంలో సూచించిన మోతాదులో కలుపు మందులు వాడితే సమస్య ఉండదని తెలిపారు. వరి విత్తిన వెంటనే ప్రీటిలక్లోర్ కలుపు మందును ఎకరాకు 600 మిల్లీ లీటర్లు లేదా పిండిమిథాలిన్ 38.7 సీఎస్ 700 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిసేటట్లు పిచికారీ చేయాలని సూచించారు. వరి విత్తిన 20 రోజుల వరి పైరులో గడ్డి, వెడాల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి బాగా పిచికారీ చేయాలని వివరించారు. గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉంటే, ఫెనోక్సాప్రోప్ పిథైల్‌ను 350 మిల్లీ లీటర్ల ద్రావణంలో 200 లీటర్ల నీటిని కలిపి పొలంపై పిచికారీ చేయాలని సూచించారు. విత్తిన 30 రోజుల వయసు గల పైరులో వర్షాల వల్ల కలుపు సమస్య పెరిగే అవకావం ఉన్నందున 2,4డీ అమైన్ సాల్టులో 58 శాతం ఐసీ 2 మిల్లీ లీటర్లు, 10 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు ఎనిమిది గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యద పద్ధతిలో వరి విత్తు వేసిన రైతులు పైన పేర్కొన్న యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉజ్వల భవిత

» జన శిక్షణ సంస్థాన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో కొణతాల



శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జూలై 12 : సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో ఏర్పాటైన టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తి నైపుణ్యం ఉంటే అన్నివిధాలా రాణించవచ్చునన్నారు. జనశిక్షణ సంస్థాన్ ఛైర్మన్ సీఏ రామరాజు మాట్లాడుతూ శిక్షణ కాలంలో స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షులు డీ.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణఅప్పారావు, జేఎస్ఎస్ డైరెక్టర్ కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గతంలో శిక్షణ పొందిన వారికి ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు.

'అచ్యుతాపురంలో సంత ప్రాంతం అభివృద్ధి'



దిమిలిలో పారిశుధ్య పనులపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం/ రూరల్, జూలై 12: సెజ్‌లో గల లారస్ ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అచ్యుతాపురం మండల కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న సంత ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కంపెనీ ప్రతినిధులతో కలిసి సంత ప్రాంతాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బొకేలు వద్దు.. దివ్యాంగుల పాఠశాలకు సహాయం చేయండి

ఎమ్మెల్యే సుందరపు శుక్రవారం తన వాట్సప్ ద్వారా పెట్టిన పోస్టింగ్‌పై పలువురు స్పందించారు. తన వద్దకు వచ్చేవారు ఎవరూ పూలదండలు, పుష్పగుచ్ఛాలు తేవద్దని పేర్కొన్నారు. కొండకర్లలో దివ్యాంగుల పాఠశాల నడుపుతున్న ఇచ్ఛా ఫౌండేషన్‌కు తోచిన సహాయాన్ని చేసి ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా తన కార్యాలయం వద్ద ఆ సంస్థకు చెందిన డిబ్బీని ఏర్పాటు చేయడంతో దాతలు తోచినంత వేయడం ఆరంభించారు.

దిమిలిలో పారిశుధ్య పనుల పరిశీలన

రాంబిల్లి : దిమిలిలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎమ్మెల్యే విజయకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల ఆయన గ్రామాన్ని సందర్శించినప్పుడు ఇక్కడి సమస్యలను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని అంతా చెప్పడంతో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో సదరు పనులను పరిశీలించిన అనంతరం పలు సూచనలు చేశారు టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకరన్న దొర, మాజీ సర్పంచ్ కోటాపు వడ్డికాసులు, కరణం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బృందం ప్రతినిధి

సబ్బవరం, జూలై 12 : అమృతపురంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మాతా శిశు, చిన్నపిల్లలు, కిశోర బాలికల ఆరోగ్య పరిస్థితి తదితరాలపై ఆరా తీసింది. క్షేత్ర స్థాయిలో గుర్తించిన లోపాలను ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం ప్రతినిధి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లూసీ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గణాంకాధికారి రామచంద్రరావు, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీష్ నానాజీ, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, డేటా మేనేజర్ జనార్ధన్ గుల్లేపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

... 3వ పేజీ తరువాయి

కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అచ్యుతాపురం పరిశ్రమల సంఘం సభ్యులు కలెక్టర్‌కు విన్నవించిన సమస్యలపై చర్చించారు. అచ్యుతాపురం-పరవాడ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. పరిశ్రమలకు హెచ్‌టీ పవర్ సప్లై, నీటి చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీ సమస్యల గురించి కలెక్టర్ చర్చించారు. వచ్చే సమావేశం నాటికి అన్ని సమస్యలకు పరిష్కారం చూపాలని పరిశ్రమల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మనేజరు హరిప్రసాద్, భూగర్భ గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు, కార్మిక శాఖ జిల్లా అధికారి వసంతరావు వివిధ పరిశ్రమ కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి

» కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి » అనధికార కొళాయిలకు రూ.5,075 వసూలు చేసేలా కార్యాచరణకు సూచన

» పైపులైన్ల మరమ్మతు, పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం » వార్డుల్లో సమస్యలను ప్రస్తావించిన సభ్యులు



సమావేశానికి హాజరైన సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జూలై 12 : మునిసిపాలిటీ అభివృద్ధికి ఆదాయ వనరులను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఇక్కడి మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్లు తరచూ పాడవుతున్నాయని, వీటి మరమ్మతు పనులకు అధిక శాతం నిధులు వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. అలాగే, మునిసిపాలిటీలో సుమారు 5,520 వ్యక్తిగత కుళాయిలు ఉన్నాయని, కానీ వీటి నుంచి పన్ను రూపంలో వసూలయ్యేది స్వల్పంగానే ఉందని వివరించారు. అధికారికంగా ఉన్న తాగునీటి కుళాయిలు కాకుండా అనధికారికంగా ఏర్పాటు చేసిన కుళాయిలకు రూ.5,075లు మునిసిపాలిటీకి చెల్లించేలా సిబ్బంది కార్యాచరణ సిద్ధం చేయాలని ఆమె సూచించారు. ఫలితంగా ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. విలీన వార్డులతో సహా అన్నిచోటల్లా పారిశుధ్య పరిస్థితులను మరింత మెరుగుపర్చేందుకు కార్మికులతో నిర్ధేశించిన రోజుల్లో సామూహికంగా పనులు జరిపించేలా చర్యలు తీసుకున్నామని, కౌన్సిలర్లు కూడా జూమ్ ద్వారా వీటిని వీక్షించాలని సూచించారు.

'సీహెచ్‌సీలో సాయంత్రం నాలుగు దాటితే వైద్యం అందడం లేదు'

సీహెచ్‌సీలో సాయంత్రం నాలుగు గంటలు దాటితే వైద్యం అందడం లేదని, ప్రతి చిన్న వైద్యానికి అనకాపల్లి రిఫర్ చేస్తున్నారని కౌన్సిలర్లు రాపేటి సంతోష్, మరిణేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే, నిరంతర విద్యుత్ సరఫరా పేరుతో విద్యుత్ అధికారులు సోమలింగపాలెం, కట్టుపాలెం ప్రాంతాల్లో చెట్లను అత్యంత దారుణంగా నరికేస్తున్నారని కౌన్సిలర్ పండూరి హరినాథ్ వాపోయారు. వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయ భవనంపై కౌన్సిల్ సమావేశ భవనం నిర్మించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా శ్మశానవాటిక వద్ద అధికారికంగా సిబ్బందిని నియమించాలన్నారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన అంశాల్లోని కొన్నింటిపై చర్చ సాగించారు. అలాగే, మరికొంత మంది సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రభాకర్‌రావు, వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, డీఈ వీరయ్య, ఆర్‌వో నీలిమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, టీడీపీవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి ఇద్దరేసి అధికారులా..?

ఇదిలావుంటే, మునిసిపల్ సమావేశానికి పలు శాఖల నుంచి ఇద్దరేసి అధికారులు హాజరు కావడంపై విమర్శలు వినిపించాయి. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖకు చెందిన అధికారి ఒకరు సమాధానం చెపితే సరిపోతుందని, ఇలా ఇద్దరేసి హాజరై కార్యాలయాల్లో విలువైన సమయాన్ని ఎందుకు వృథా చేస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు సభ్యులు వాపోయారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కోటవురట్ల పాఠశాలలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

కోటవురట్ల, జూలై 12 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు శుక్రవారం మండలంలోని పలు పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలన్నా, మంచి ఫలితాలు రావాలన్నా ఉపాధ్యాయులు మరింత బాగా కృషి చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని సాగిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ప్రతినిధులు సత్యాడ దాసు, ఈవీ రమణ, ఎం.కృష్ణప్రసాద్ మండల శాఖ అధ్యక్షుడు సత్యాడ సంగీత్‌రాజు, ప్రధాన కార్యదర్శి లోవరాజు, జాన్ సుధాకర్, సన్యాసిరావు, రాము పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 12 : వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు శుక్రవారం ఇక్కడి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థిల వసతి గృహాలకు గత ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదన్నారు. ప్రస్తుతం రెండు నెలల నిధుల విడుదలకు ప్రక్రియ మొదలు పెట్టారన్నారు. నిధులు లేమి కారణంగా వసతి గృహాల్లోని విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందడం లేదని, మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో చేపట్టవలసిన హాస్టల్ భవనాల మరమ్మతులు ఎన్నికల కారణంగా జరగలేదన్నారు. కొన్ని వసతి గృహాల్లో సిబ్బంది కొరత ఉందని, ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రతినిధి సవరాల గణేష్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్, సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, విద్యార్థి నాయకుడు జి.ఫణీంద్ర, మామిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ వైద్య సిబ్బంది ఆందోళన

» వైసీపీ ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేసిందని ఆవేదన

అనకాపల్లి టౌన్, జూలై 12 : మత్తు వ్యసన విముక్తి కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట జీతాల కోసం శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో మత్తు వ్యసన విముక్తి కేంద్రాలను రాష్ట్రంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో పనిచేయడానికి నియామకమయ్యామన్నారు. వైసీపీప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ సెంటర్‌లో ఏడాది పాటు వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయని వాపోయారు. దీనిపై గతంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. కష్టాల్లో ఉన్న తమను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆదుకుని జీతాలు చెల్లించాలని సిబ్బంది క్రాంతికుమార్, బి.నాయుడు బాబు, ఎ.మణి, బి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి తదితరులు కోరారు. ఆందోళన చేస్తున్న సిబ్బందికి ఏపీ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు సంఘీభావం తెలిపారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు

నక్కపల్లి, జూలై 12 : బాల్య వివాహాల వల్ల అనర్థాలపై రాజయ్యపేట హైస్కూల్‌లో హెచ్ఎం నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. అంతేకాకుండా ఇలా వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. ఈ విషయంలో నిరక్షరాస్యుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జడ్పీటీసీ గోసల కాసులమ్మ, సర్పంచ్ పిక్క అప్పలనర్స, సీనియర్ ఉపాధ్యాయుడు డీవీఎస్ రావు, టీడీపీ నాయకులు పిక్కిసత్తియ్య, గంగరాజు, మడదారాంబాబు,పాల్గొన్నారు.

'పంచాయతీ నిధులు దుర్వినియోగం'



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ఎస్.నర్సాపురం గ్రామస్థులు

నక్కపల్లి, జూలై 12 : ఎస్.నర్సాపురం పంచాయతీ పరిధిలో పాలకమండలి సభ్యుల తీర్మానం లేకుండా రూ.కోటి పైగా నిధులను ఇష్టానుసారం ఖర్చు చేశారని ఆరోపిస్తూ ఆ పంచాయతీకి చెందిన పలువురు పెద్దలు, సభ్యులు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా హెటెరో ఔషధ పరిశ్రమ ద్వారా సమకూరిన లక్షలాది రూపాయలు నిధులు, ఆర్థిక సంఘం నిధులను ఏ పనులకు ఎంత మేర వినియోగించారో తెలియజేయాలని కోరారు. పంచాయతీ సభ్యులు జీకే రాజు, డి.బాబ్జీ, వీరబాబు, మంగ, రాజేశ్వరి, టీడీపీ నాయకులు గట్టెం గణేశ్, వంగలపూడి శ్రీను ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.

తక్కువ ధరలకు నిత్యావసర సరకులు

అనకాపల్లి టౌన్/ఎలమంచిలి, జూలై 12 : ధరల నియంత్రణ, వినియోగదారుల సౌకర్యార్థం పట్టణంలోని మెయిన్ రోడ్డులో కందిపప్పు, బియ్యం కౌంటర్ శుక్రవారం ఏర్పాటైంది. అనకాపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన కందిపప్పు రూ.160లకు, బియ్యం కిలో రూ. 49లకు అమ్మకాలు జరుపుతున్నట్టు చెప్పారు. స్థానిక మెయిన్‌రోడ్డులో గల శ్రీధరాల జోగారావు షాపు వద్ద ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వోలు కళ్యాణి, నందకిశోర్, సీఎస్‌డీటీ లీలాశేషుకుమారి, అనకాపల్లి రైస్, డాల్ మర్చెంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీధరాల సోమరాజు, అధ్యక్షుడు బొడ్డేడ శంకరరావు, కార్యదర్శి గుండా సాయి, కోశాధికారి బొచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎలమంచిలి పట్టణంలో చౌక ధరలకు నిత్యావసర సరకులు అందించే స్టాల్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తదితరులు ప్రారంభించారు.

ప్రభుత్వం దృష్టికి పెన్షనర్ల సమస్యలు

ఎలమంచిలి, జూలై 12 : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు తెలిపారు.ఇక్కడి ఎన్‌జీవో హోమ్‌లో శుక్రవారం ఏర్పాటైన ఎలమంచిలి తాలూకా యూనిట్ పెన్షనర్ల సంఘ సమావేశంలో మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారిని ఘనంగా సన్మానించారు. సంఘం ఎలమంచిలి తాలూకా అధ్యక్షుడు సీహెచ్.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

నక్కపల్లి, జూలై 12 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు తొమ్మిది వారాలుగా ఇవ్వాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కార్యదర్శి ఎం.రాజేశ్ నేతృత్వంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కూలీలు కష్టపడి పనిచేసినా డబ్బులు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ట్రిపుల్ ఐటీలో పలువురికి సీట్లు

లంకెలపాలెం, జూలై 12 : జిల్లాలోని వివిధ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఐటీ విద్యాలయాల్లో సీట్లు పొందారు. పరవాడ మండలంలో తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో దివాకర్ తెలిపారు. పెదముషిడివాడ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి దాలిబోయిన హనిశ్రీ, శీరంశెట్టి విజయదుర్గ, గొంప సాయిసింధు, ఉగ్గిన పూజిత ఎంపికయ్యారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గరికపాటి హర్షశివ సాయి వర్ధన్, వాడచీపురపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దూడ రఘు, కూండ్రపు చాందిని, పరవాడ జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల నుంచి పి.జయవర్ధన్, బాలికోన్నత పాఠశాల నుంచి బి.అమృతవర్షిణిలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించినట్లు చెప్పారు.

తుమ్మపాల : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెంలో గల మహాత్మా గాంధీ జ్యోతి బాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పైలా మౌళి, ఇంద్ర ఆకాష్‌లు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్టు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయులు మహేంద్రనాథ్ పట్నాయక్ తెలిపారు.

కశింకోట : తాళ్లపాలెం ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన యెరుబండి రేవంత్ దుర్గా అబిరామ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి తెలిపారు.

పాయకరావుపేట రూరల్ : సత్యవరం ఏడీజూఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కె.నాగచైతన్య, జీఎంఎం సత్యలక్ష్మి, జీ.సాయి పవన్‌లు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు తెలిపారు

నక్కపల్లి : గొడిచెర్ల హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి చదివిన వి.సుభాష్, పి.హర్ష, పి.జగదీశ్‌లు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవో కె.నరేశ్, పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

ఎస్.రాయవరం : దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతి చదివిన కొమారి దేవిశంకర్ వరప్రసాద్, కంచర్ల వెంకట పవన్ సాయి అనే విద్యార్థులు ఇద్దరూ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం రమణశ్రీ తెలిపారు.

కోటవురట్ల : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి చదిన రాజుపేటకు చెందిన యల్లపు రిషిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం యేసుదాసు తెలిపారు.

అచ్యుతాపురం : మండలంలోని ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అచ్యుతాపురం కస్తూర్బా విద్యాలయానికి చెందిన నందవరపు ఝాన్సీ, పైల నిఖిత, అలాగే జడ్పీఉన్నత పాఠశాల నుంచి యర్రంశెట్టి సాహితీలు ఎంపికైనట్టు కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ ఉమాదేవి, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.




ఎస్.రాయవరం : గుడివాడ పాఠశాలలో కిట్ల పంపిణీ

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ఎస్. రాయవరం, జూలై 12 : గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లతో కూడిన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు, మాజీ జడ్పీటీసీ బి.వరహాలు, ఎం.కృష్ణరాజు, పి.గణపతి రాజు, పి.వంశీవర్మ, జి .రమణ పాల్గొన్నారు.

పరవాడ : ప్రభుత్వం మంజూరు చేసిన నోట్ పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని చోడపల్లి రెవెన్యూ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని సావిత్రితో పాటు కూటమి నాయకులు కర్రి వెంకటరమణ, సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలం చోడపల్లి పాఠశాలలో...

శాకంబరి అలంకరణలో నల్లమారమ్మ



కొత్తూరు, జూలై 12 : మేజర్ పంచాయతీ కొత్తూరులోని రామాపురంలో కొలువుదీరిన నల్లమారమ్మ శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో విశేషంగా అలంకరించిన అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

'ఉత్తరాంధ్ర అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం'



మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, జూలై 12 : ఉత్తరాంధ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద నిర్మాణంలో ఉన్న పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసేందుకు రూ.800 కోట్లు వ్యయమవుతోందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేనప్పటికీ ముఖ్యమంత్రి నిధుల మంజూరుకు అంగీకరించారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు పనులు 2026 మార్చి నాటికి పూర్తిచేసి ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందన్నారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కంపోస్టుయార్డును పట్టణ శివారుకు తరలించేందుకు సీఎం ఆదేశించి నట్టు చెప్పారు. కంపోస్టుయార్డు నుంచి థర్మల్ విద్యుత్ తయారు చేస్తామన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో మూడు నెలల్లో కంపోస్టుయార్డును తరలించేందుకు చర్యలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలో మూడు చక్కెర కర్మాగారాల పరిధిలో చెరకు పండించే భూములను తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం వంటి వాటిని ప్రభుత్వం సమకూర్చుతుండడంతో పాటు గుణాత్మక విద్య అందించేలా ఏర్పాట్లు చేసిందని మర్రిబంద ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయుడు ఎం.మల్లికార్జునరావు అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ జోగా నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్త సరోజని, గ్రామ పెద్ద కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే దృష్టికి సంపతిపురం సమస్యలు'

కొత్తూరు, జూలై 12 : సంపతిపురం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ నంబారు నాగమణి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన గ్రామ సభలో మాట్లాడారు. గ్రామంలో సమస్యలపై చర్చించి పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వీటన్నింటి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యానాద్రి కాలువలో చురుగ్గా పూడికతీత

ఎలమంచిలి, జూలై 12 : పట్టణంలోని యానాద్రి కాలువలో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తపేట, మిలట్రీ కాలనీ ప్రాంతాల్లో ఏళ్లతరబడి పూడిక పేరుకు పోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్య మునిసిపాలిటీ దృష్టికి పలుమార్లు వెళ్లడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. జేసీబీ సహాయంతో పూడికను తొలగిస్తున్నారు. ఛైర్‌పర్సన్ రమాకుమారితో పాటు కమిషనర్ ప్రభాకరరావు, వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, డీఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు శుక్రవారం ఈ పనులను పరిశీలించి సూచనలు చేశారు.

మెగా ఉచిత వైద్య శిబిరం రేపు

పరవాడ, జూలై 12 : స్థానిక సినిమాహాల్ జంక్షన్‌లో వెంకటేశ్వర మెడికల్ అండ్ డాక్టర్ ప్లాజా, ఆర్‌కే డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న ఈ శిబిరంలో అన్నిరకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పరవాడ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

బలిజపాలెంలో రహదారి వివాదం

సబ్బవరం, జూలై 12 : మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలో రహదారి విషయమై ఇరువర్గాల మధ్య శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. నారపాడులోని సర్వే నెంబరు 161లో గెడ్డవాగు ఉంది. దీనికి ఇరువైపులా రైతులు ఆక్రమించుకున్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి అధికార పార్టీ నేతలు మామిడి అప్పారావు అనే రైతు ఆక్రమణలో ఉన్న గెడ్డవాగు నుంచి తాసుబిల్లి వారి కళ్లాల్లోకి రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో అప్పారావు తన ఆక్రమణలో ఉన్న భూమిలో నుంచి రహదారి వేయవద్దని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి గెడ్డవాగుకు హద్దులు నిర్ణయించడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, అప్పుడు ఏర్పాటు చేసిన అదే రహదారిని శుక్రవారం మామిడి అప్పారావు ఎక్సకవేటర్ సహాయంతో తవ్వేయడంతో మళ్లీ వివాదం రాజుకుంది ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు గెడ్డవాగులు ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. సర్వే చేసే వరకూ గొడవలు పడవద్దని ఆర్ఐ వీరయ్య, వీఆర్వో అనంత్ సూచించారు.

పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

సబ్బవరం, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని మలునాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం ఎల్.సాంబమూర్తి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా మాడుగుల

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ఎమ్మెల్యే బండారును సత్కరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు

చీడికాడ, జూలై 12 : మాడుగుల నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. చీడికాడలో శుక్రవారం జరిగిన మండల సమావేశానికి వచ్చిన ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ చెరకుపంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో 90 శాతం సాగును వదిలేశారన్నారు. దీంతో షుగర్ ఫ్యాక్టరీ మూతపడే అవకాశం ఉన్నందున ప్రస్తుతం చెరకు టన్నుకు రూ.2800లు అందిస్తున్నారని అన్నారు. దీన్ని రెట్టింపు చేసి రైతులకు మద్దతు ధర అందించేందుకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో చర్చించినట్టు చెప్పారు. భవిష్యత్తులో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమైన రోడ్ల వెడల్పునకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. అర్జునగిరి, చీడిపల్లి పంచాయతీల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చీడికాడ మండలంలో జి.కొత్తపల్లి కేజీబీవీ పాఠశాల పక్కన 300 నుంచి 500 ఎకరాల వరకూ స్థలం గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎమ్మెల్యే బండారును ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, ఎంపీటీసీలు, ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహసీల్దార్ ప్రకాష్‌లు ఘనంగా సన్మానించారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక

చోడవరం, జూలై 12 : పట్టణంలోని కొత్తూరు జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హైస్కూల్ హెచ్ఎంబీవీ రామిరెడ్డి తెలిపారు. ఎస్.కల్పన, జి.నాగలక్ష్మి, ఎం.నేహా, టి.లీల, వై.యశ్వంతిసత్యలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు.

కె.కోటపాడు : చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పాచిల లోష్నవి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఇక్కడ చదువుకొని ఇటీవల పదో తరగతిలో 570 మార్కులతో కె. కోటపాడు మండల టాపర్‌గా నిలిచింది. తమ విద్యార్థిని ట్రిపుల్ ఐటీలో సీటు పొందడం ఆనందంగా ఉందని పాఠశాల హెచ్ఎం బి.సన్నిబాబు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

రోలుగుంట : మండలంలోని రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన షేక్ సయ్యద్ అన్సారీ కరీంకు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో పాఠశాల హెచ్ఎం డీఎస్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రామకృష్ణ, సర్పంచ్ వరలక్ష్మిల చేతుల మీదుగా అన్సారీకి వాచీ బహూకరించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు శర్మ రూ.2 వేలు, తెలుగు ఉపాధ్యాయిని సునీత రూ.1000 చొప్పున నగదు బహుమతిగా అందించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాక్షించారు.

గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం నుంచి మైచర్ల మాధవి పదో తరగతిలో 552 మార్కులు, చీడిగుమ్మల హైస్కూల్‌కు చెందిన కె.లిఖిత కావ్య పదో తరగతిలో 563 మార్కులు సాధించారు. వీరిద్దరూ ట్రిపుల్ ఐటీకి మండలం నుంచి ఎంపికయ్యారు. వీరికి మండల ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

చీడికాడ : మండలంలో ఖండివరం హైస్కూల్‌కు చెందిన అమలకంటి భానుసంపత్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో సంపత్ 573 మార్కులు సాధించాడు. దీంతో సంపత్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి ఆచారి తెలిపారు.

కొత్తకోట సంత మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రావికమతం, జూలై 12 : మేజరు పంచాయతీ సంత మార్కెట్ ప్రభుత్వ స్థలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన వార్డు మెంబరు భర్త ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను శుక్రవారం ఎంపీడీవో భానోజీరావు సమక్షంలో తొలగించారు. 2018లో ఈ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. ఈలోగా ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో కొత్తకోట పంచాయతీ ఒకటవ వార్డు మెంబరు సీతాశ్రావణి (వైసీపీ) భర్త గిరి కోనేరు సంతమార్కెట్ మండల పరిషత్‌కు చెందిన ఈ స్థలంలో అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. అయితే అప్పట్లో గ్రామస్థులుఅభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా నిర్మాణాలు నిలిపివేసిన గిరి ఇటీవల మళ్లీ అక్కడ షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, ఎంపీడీవో భానోజీరావు సమక్షంలో ఆ నిర్మాణాలను తొలగించారు.

అంధ బాలికల పాఠశాలను సందర్శించిన జడ్జిలు

విశాఖపట్నం, జూలై 12 : బీచ్‌రోడ్డులోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను చోడవరం పట్టణానికి చెందిన జడ్జిలు శుక్రవారం సందర్శిం చారు. న్యాయ అవగాహన సదస్సుల్లో పాల్గొనడానికి నగరానికి వచ్చిన వారు మార్గమధ్యలో ఉన్న ఆశ్రమాన్ని చూసి, బాలికల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం వసతి, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకుని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు జి.స్వర్ణ, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రుణాలు ఇప్పించరూ..

స్పీకర్ అయ్యన్నకు దివ్యాంగుల వినతి



స్పీకర్‌ను కలిసిన బధిర, మూగ దివ్యాంగుల సంఘ ప్రతినిధులు

నర్సీపట్నం, జూలై 12 : బధిర, మూగ దివ్యాంగులకు రాయితీపై రుణాలు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా బధిర, మూగ దివ్యాంగుల సంఘం ప్రతినిధులు సభాపతి అయ్యన్నపాత్రుడుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బధిర, మూగ దివ్యాంగుల కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ పింఛను తీసుకోవడానికి అర్హులు ఉంటే ఎటువంటి ఆంక్షలు లేకుండా మంజూరు చేయాలని కోరారు. విశాఖపట్నం ఈఎన్టీ మెడికల్ బోర్డు అథారిటీలో ఆడియాలజిస్టు పోస్టు భర్తీ చేయాలని వినతిపత్రంలో కోరారు. వినికిడి లోపంతో ఉన్న దివ్యాంగులు కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు పాము పురుషోత్తమ్, కె.చిరంజీవి, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన అభివృద్ధికి నిధుల కోసం వినతి

మాకవరపాలెం, జూలై 12 : మండలంలో రాచపల్లి శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాచపల్లి కామేశ్వరిగనర్ వద్ద ఉన్న శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదన్నారు. ప్రహరీ నిర్మించాలన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

» మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం
» పని చేసే చోట లైన్‌మెన్ నివాసం లేకుంటే చర్యలు
» ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు
» ఎమ్మెల్యే బండారు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జూలై 12 : గత నెల రోజులుగా విద్యుత్ కోతలతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని వైఎస్ఎంపీపీ కిముదు చిన్నమ్మలు, ఎంపీటీసీ సభ్యురాలు ఈర్లె దేవి, సర్పంచ్‌లు కసిరెడ్డి భాగ్యలక్ష్మి, వంటాకు నర్సింహమూర్తిలు ఆగ్రహంవ్యక్తం చేశారు. చీడికాడ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. కోనాం, మంచాల, శిరిజాం, వీరభద్రునిపేట పంచాయతీల్లో వర్షాలు ఉన్నా, లేకున్నా.. రాత్రీపగలు తేడా లేకుండా తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. రాత్రి సమయాల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయన్నారు. జైతవరం లైన్‌మన్ ఎప్పుడు వస్తున్నారో లేదో ఎవరికీ తెలియదని, తాను ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు ఆరోపించారు. దిబ్బపాలెంలో పది శిథిలావస్థలో ఉన్న స్తంభాలను మార్చాలని ఎన్నిమార్లు చెప్పినా ఏఈ నమ్మి వెంకటరావు పట్టించుకోవడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచాల బ్రాహ్మణచెరువు ప్రాంతంలో వైర్లు కిందకి వేలాడినా పట్టించుకోలేదని మంచాల సర్పంచ్ కసిరెడ్డి భాగ్యలక్ష్మి ఆరోపించారు. దీనిపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కలుగజేసుకొని ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని, గ్రామ సచివాలయ లైన్‌మెన్లు పని చేసే చోట నివాసం ఉండాలని, వారం రోజుల్లో నివాసం ఏర్పాటు చేయకపోతే సస్పెండ్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి గణేష్ మాట్లాడుతుండగా గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు రాలేదని ఎంపీటీసీ బీశెట్ల కోటేశ్వరరావు అన్నారు.

దీనిపై ఎమ్మెల్యే బండారు కలుగజేసుకొని ఆ వివరాలు తనకు ఇవ్వాలని, అలాగే గ్రామాల్లో శ్మశానాలు, పశువైద్య భవనాల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారాప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ హౌసింగ్‌లో గృహాలు కట్టిన వారికి బిల్లులు రాలేదని ఎంపీటీసీ బీశెట్ల కోటేశ్వరరావు అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రూపాయి బిల్లు పడిన వారి పేర్లు జగనన్న కాలనీలో ఇల్లు పూర్తి చేసిన వారిపేర్లు గుర్తించి వెంటనే నివేదిక ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ సూరిబాబును ఆదేశించారు. ఉపాధి పథకం గురించి ఏపీవో నాగరాజు వివరిస్తుండగా గతంలో 70 వర్మీ కంపోస్టులు నిర్మించిన బిల్లులు ఇవ్వలేదని జి.కొత్తపల్లి సర్పంచ్ సూరినాయుడు అన్నారు. 4ఎల్ కాలువ నిర్మించకపోవడంతో చెట్టుపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి గ్రామాలకు సాగునీరు రాలేదని సర్పంచ్ గొర్లె గణేష్ ప్రస్తావించారు. మర్రగుమ్మి ఆనకట్టు శిథిలావస్థలో ఉందని జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూరినాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. నాడు-నేడులో ఏడు పాఠశాలలకు పూర్తిస్థాయిలో నిధులు రాలేదని ఎంపీపీ కురచా జయమ్మ, కో-ఆప్షన్ మెంబరు షేక్ సూర్యనారాయణ సభదృష్టికి తీసుకువెళ్లడంతో దీనిపై నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు ఆదేశించారు. ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించినపుడు సర్పంచ్‌లు, ఎంపీటీసీలను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ లాలం శారదవరలక్ష్మి, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీ ల్దార్ ప్రకాశరావు, ఏవో ఎల్.కామేశ్వరరావు, ఈవోపీ ఆర్‌డీ కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల కోసం గొడగలీల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గొడగలీ కులస్థులు

రావికమతం, జూలై 12 : తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరుతూ మండలంలోని కొత్తకోటకు చెందిన గొడగలీ కులస్తులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సీ సబ్ క్యాస్ట్‌లో ఒకటైన తమకు 2023 వరకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని తెలిపారు. ఇప్పుడు గ్రామ సచివాలయానికి వెళ్లగా గొడగలి కులస్థులకు సంబంధించిన ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేదని సిబ్బంది చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ రమణారావుకు వినతిపత్రం అందజేశారు.

ఈ విషయమై తహసీల్దార్ రమణరావు మాట్లాడుతూ సచివాలయం నుంచి తమకు అందిన దరఖాస్తులకు మాత్రమే విచారణ చేపట్టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే అధికారం తమకుందన్నారు. ఆన్‌లైన్‌లో గొడగలీ కులస్తులకు ఆప్షన్ లేని విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు

» తహసీల్దార్ మురళీమోహన్‌రావు



అక్రమ ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్

మాకవరపాలెం, జూలై 12 : మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ మురళీమోహన్‌రావు హెచ్చరించారు. 'నిరాటంకంగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికన ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్పానది వద్ద ఉన్న ఇసుక అక్రమ ర్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరపకుండా వీఆర్వోలకు సూచించామన్నారు. దీనిపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. రామకృష్ణారావు, డీటీ ప్రసాదరావు, వీఆర్‌వో లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనాలు

» ఎంపీడీవో రత్నకుమారి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నకుమారి

గొలుగొండ, జూలై 12 : మండలంలోని గురుకుల కళాశాలను శుక్రవారం ఎంపీడీవో రత్నకుమారి సందర్శించారు. విద్యార్థులకు వడ్డించే భోజనాలు, కళాశాల పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై ఉపాధ్యాయులు వివరించాలన్నారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ డా.చిట్టినాయుడు

బుచ్చెయ్యపేట, జూలై 12 : మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడిని సాధించవచ్చని పశు సంవర్ధకశాఖ చోడవరం డివిజన్ సహాయ సంచాలకులు డాక్టరు వి.చిట్టినాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం దిబ్బిడిలో పశుగ్రాసంలో పోషక విలువలపై రైతులకు అవగాహన కల్పించారు. దాణా కన్నా పచ్చని పశుగ్రాసం మేతగా అందిస్తే అధిక పాల దిగుబడి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట పశు వైద్య కేంద్రం వైద్యాధికారి వై.ఉమామహేశ్వరి, సర్పంచ్ పి.మాణిక్యం, అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, ఏహెచ్ఏ జి.సత్యనారాయణ, గోపాలమిత్ర జి.మణికంఠ పాడి రైతులు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్ : మేలైన పశుగ్రాసాన్ని పాడి పశువులకు మేతగా పెట్టడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని కింతలి వల్లాపురం పశు వైద్యాధికారి నరేశ్ అన్నారు. శుక్రవారం పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా లోవ పొన్నవోలులో పాడి రైతులకు పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. పశుగ్రాసం సాగు విధానం, నిల్వ ఉంచడం పలు ప్రయోజనాలను వివరించారు. పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రాజు, ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ, మాజీ ఉప సర్పంచ్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతు సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీధర్‌బాబు

మాకవరపాలెం, జూలై 12 : రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు తప్పనిసరిగా పాటించాలని 'ఆత్మ' ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మ ప్రోగ్రాం ద్వారా రైతులకు అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా మాటాడుతూ వాతవరణం పరిస్థితులు అనుసరించి అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. అలాగే విత్తనశుద్ధి, ఆవశ్యకత,సమగ్ర ఎరువులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామీణా విత్తనోత్పత్తి పథకం వరినారు మడులు కలుపు యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు విజేత, చిరంజీవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేజే పురంలో వరినారుమడులు పరిశీలన



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మాడుగుల రూరల్, జూలై 12 : మండలంలోని కేజేపురంలో శుక్రవారం సరిగ్గా మొలకెత్తని వరి విత్తనాలు, నారుమడులను ఏపీ సీడ్స్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ కేప త్రినాథరావు, ఆర్బీకే సిబ్బంది పరిశీలించారు. కేజే పురంలో ఆర్బీకే ద్వారా సరఫరా చేసిన ఆర్‌జీఎల్ వరి విత్తనాలు పలు చోట్ల సరిగ్గా మొలకెత్తలేదని, ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు దృష్టికి ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు తీసుకెళ్లారు. దీంతో ఏవో ఈ విషయాన్ని ఏపీ సీడ్స్ అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏపీ సీడ్స్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ కేప త్రినాథరావు, వీఏఏ శ్రావణి వరి విత్తనాలు, నారుమడులను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించి దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, ఎంపీఈవో జగ్గారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

... 3వ పేజీ తరువాయి

కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అచ్యుతాపురం పరిశ్రమల సంఘం సభ్యులు కలెక్టర్‌కు విన్నవించిన సమస్యలపై చర్చించారు. అచ్యుతాపురం-పరవాడ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. పరిశ్రమలకు హెచ్‌టీ పవర్ సప్లై, నీటి చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీ సమస్యల గురించి కలెక్టర్ చర్చించారు. వచ్చే సమావేశం నాటికి అన్ని సమస్యలకు పరిష్కారం చూపాలని పరిశ్రమల శాఖాధికారు లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మనేజరుహరిప్రసాద్, భూగర్భ గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు, కార్మిక శాఖ జిల్లా అధికారి వసంతరావు వివిధ పరిశ్రమ కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.

భూకబ్జా ఫిర్యాదుపై విచారణ



ఫిర్యాదుదారుని సమక్షంలో విచారణ చేపడుతున్న వీఆర్వో తదితరులు

రోలుగుంట, జూన్ 12 : మండలంలోని కుసర్లపూడి గ్రామ రెవెన్యూలో సర్వే నెం.739-1ఏలో ఉన్న 1.18 ఎకరాల సాగుభూమి రికార్డులను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మరోవ్యక్తి పేరు మీద మార్చేశారంటూ కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుపై వీఆర్వో శుక్రవారం విచారణ చేపట్టారు. కుసర్లపూడి గ్రామానికి చెందిన దళిత రైతు కంఠం దేముడు ఈ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వీఆర్వో శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు కంఠం దేముడు సమక్షంలో భూమి వివరాలను పరిశీలించారు. ఇదే సర్వే నెంబరులో 2008లో ప్రభుత్వం డి.పట్టా ఇవ్వడంతో మఠం గంగయ్యమ్మ అప్పటి నుంచి ఈ భూమిలో జీడిమామిడి సాగు చేస్తున్నారని వీఆర్వో స్పష్టం చేశారు. ఇదే భూమి తనదని చెబుతున్న దేముడు వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఆయన శుక్రవారం క్షేత్రస్థాయి విచారణలో కూడా ఎటువంటి రికార్డులు కూడా సమర్పించలేదని తెలిపారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నట్టు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మాకవరపాలెం, జూలై 12 : మృతుడి కుటుంబానికి అతడి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. కొత్తపాలేనికి చెందిన ఏకా సత్తిబాబు ఈ నెల 2న రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.పేద కుటుంబ కావడంతో వారి స్నేహితులైన టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు శంకర్‌గిరిబాబు రూ.5 వేలతో పాటు మరో రూ.65 వేలను పోగుచేసి సత్తిబాబు భార్య లక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు రోంగల సత్తిబాబు, ఏకా గోవింద పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు

దేవరాపల్లి, జూలై 12 : ప్రతి కౌలు రైతుకు గుర్తింపుకార్డు అందించడంలో చురుకుగా పని చేయాలని వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించా రు. వీర్వో లాగిన్‌తో కౌలు రైతు కార్డు పొందడానికి అవకాశం కల్పించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు చెందివేరే భూముల్లో సాగు చేస్తున్నవారు అర్హులన్నారు.

☛ సంక్షిప్తంగా..

15 రోజుల నుంచి తాగునీరు లేదు

» నాగన్నదొరపాలెం వాసుల ఆవేదన

గొలుగొండ, జూలై 12 : మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామపంచాయతీ శివారు నాగందొరపాలెంలో రెండు వారాలుగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాగందొరపాలెంలో విద్యుత్ మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో గత 15 రోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం విద్యుత్ మోటారు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొలుగొండ, జూలై 12 : గొలుగొండ, కృష్ణాదేవిపేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిల్లో శనివారం విద్యుత్ వైర్ల కింద చెట్లు తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణ తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా ఉండదని పేర్కొన్నారు. జోగంపేట నుంచి చీడిగుమ్మల, కరక, కొత్తఎల్లవరం, కృష్ణాదేవిపేట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

దేవరాపల్లి : మండల కేంద్రం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు సరఫరాఉండదన్నారు.

మండల కేంద్రానికి విద్యార్థుల యూనిఫాం క్లాత్

రావికమతం, జూలై 12 : మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు యూనిఫామ్ క్లాత్ మండల కేంద్రానికి చేరుకొంది. వివిధ పాఠశాలలకు చెందిన ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,599 మంది విద్యార్థులు, 2896 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి ఒక్కొరికి రెండు జతల యూనిఫామ్‌లు పంపిణీకి అవసరమైన క్లాత్ ఇక్కడికి చేరుకుంది. దీనిని ఆయా పాఠశాల విద్యార్థుల సంఖ్య ఆధారంగా మండల విద్యాశాఖ అధికారులు తరలిస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు అందజేత



ప్రభుత్వ కార్యాలయాలకు ఫొటోలు అందజేస్తున్న కూటమి నేతలు

రావికమతం, జూలై 12 : మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలను శుక్రవారం కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అమర్చారు. రావికమతం ఉపసర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ వి.నాగేశ్వరావు సమకూర్చిన ఈ నేతల చిత్రపటాలను మండల పరిషత్ కార్యాయం, వెలుగు, గ్రామ సచివాలయాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఆర్.కొండనాయుడు, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు గుటాల చిన్న, మైచర్లనాయుడు, గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, టి.సూరిబాబు, గంజి వెంకటరమణ, గంజి శ్రీను పాల్గొన్నారు.

వాకపల్లి సచివాలయం సందర్శన



రికార్డులు పరిశీస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి, జూలై 12 : మండలంలోని వాకపల్లి సచివాలయాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డులను తనిఖీ చేసి రక్షిత పథకం, డ్రైనేజీలను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకొని, రక్షిత పథకాలను క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు.

తాగునీటి శాంపిల్ల సేకరణ

రావికమతం, జూలై 12 : మండల కేంద్రంలోని వివిధ తాగునీటి వనరుల్లో నీటి శాంపిల్స్‌ను శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బంది సేకరించారు. ఇటీవల మండల కేంద్రంలో ముగ్గురికి అతిసార సోకడంతో ఈ వ్యాధి కారణాలను కొనుగొనే క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు, రక్షిత మంచినీటి పథకాల నుంచి శాంపిళ్లను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలకృష్ణ, గ్రామీణ నీటి సరఫరా విభాగ సిబ్బంది సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపి, ఆ వచ్చిన రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తనశుద్ధి ఆవశ్యకతపై సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుధారాణి

కృష్ణాదేవిపేట, జూలై 12 : గొలుగొండ మండలం చోద్యం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో బాగంగా రైతులకు విత్తన శుద్ధి ఆవశ్యకత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.సుధారాణి.. వరి విత్తనాల ద్వారా వచ్చే తెగుళ్ళ నివారణకు ఒక కిలో విత్తనాలకు 8 గ్రాముల సుడోమోనస్‌తో పొడిమందును విత్తనాలకు పట్టించి 24 గంటలు తర్వాత నారుమడిలో చల్లుకోవాలని సూచించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జయలక్ష్మి, శివ రైతులు పాల్గొన్నారు.